సాక్షి
నిర్మల్

బుధవారం । 10 । ఏప్రిల్ । 2024

రంజాన్ వేళలు
బుధ
ఇఫ్తార్
6:33

న్యూస్‌రీల్

అలరించిన 'కవిసమ్మేళనం'



కవితలు వినిపిస్తున్న కవులు

నిర్మల్: తెలంగాణ రచయితల వేదిక, డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని లయన్స్‌క్లబ్‌లో మంగళవారం రాత్రి ఉగాది ఉత్సవం నిర్వహించారు. ఇందులో తెరవే జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ దామెర రాములు, జిల్లా అధ్యక్షుడు నేరేళ్ల హన్మంతు, ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణంరాజు, అంబటి నారాయణ, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, కోశాధికారి పోలీస్‌భీమేశ్, సలహాదారులు తుమ్మల దేవరావు, కామారపు జగదీశ్వర్, డాక్టర్ మురళీధర్, వేణుగోపాలకృష్ణ, బొందిడి పురుషోత్తం, పత్తి శివప్రసాద్, కావేరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి, నిర్మల భారతి అధ్యక్షుడు తోడిశెట్టి పరమేశ్వర్, తదితర కవులు, రచయితలు పాల్గొన్నారు.

బాసరలో పంచాంగ శ్రవణం



పంచాంగం చెబుతున్న ప్రదీప్ మహారాజ్

భైంసా: బాసర ఆలయంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామస్తులు, భక్తులు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు ప్రదీప్‌మహారాజ్ శ్రీక్రోధి నామ సంవత్సరంలో రాశులవారీగా పంచాంగం వినిపించారు. ఈయేడాది ఏయే పంటలకు అనుకూలంగా ఉందో తెలిపారు. పంచాంగ శ్రావణం అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

నిర్మల్‌టౌన్: జిల్లాలో శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని నెలరోజులు ఏప్రిల్ 1 నుంచి 30 వరకు 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల తెలిపారు. జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నది అధికారుల నుంచి అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దని సూచించారు. ప్రజాధనానికి నష్టం కలిగించే, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు. నిషేధిత ఆయుధాలు, పేలుడు పదార్థాలు నిషేధమని తెలిపారు. జన సమూహంలో పొగ తాగడం కూడా నేరమని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు.

దేశం కోసం సమయమిద్దాం



మాట్లాడుతున్న శివకుమార్

నిర్మల్: దేశహితం కోసం ప్రతీఒక్కరు సమయాన్నివ్వాల్సిన అవసరముందని, సామాజిక సమరసతతో ధర్మరక్షణ కోసం పాటుపడాలని ఆర్‌ఎస్‌ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌కే కన్వెన్షన్‌లో మంగళవారం సాయంత్రం ఉగాది ఉత్సవం నిర్వహించారు. శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘాన్ని ప్రారంభించిన కేశవరావు హెడ్గేవార్ ఉగాది రోజునే జన్మించారన్నారు. సామాజిక సమరసతతో హిందూ సమాజ ఐక్యతకు పాటుపడాలని పిలుపునిచ్చారు. నిర్మల్‌గడ్డపై పోరాడిన రాంజీగోండు సహా వెయ్యిమంది అమరవీరులను స్మరించుకోవాలన్నారు. హెడ్గేవార్ జయంతి సందర్భంగా ఆద్య సర్‌సంఘ్‌చాలక్ ప్రణామ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో లక్కడి మోహన్‌రెడ్డి, జిల్లా, నగర సంఘచాలక్‌లు పాల్గొన్నారు.

మద్యం, నగదుకు చెక్!?

- ఎన్నికలవేళ నిఘా పెంచిన పోలీసులు
- జిల్లాలో 7 చెక్ పోస్టులు ఏర్పాటు
- తనిఖీల్లో పట్టుబడుతున్న డబ్బులు
- బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

జిల్లాలో ఇప్పటి వరకు పట్టుబడిన మద్యం, నగదు వివరాలు..	
నగదు	రూ.53,02,610
మద్యం	రూ.5,93,994



కుభీర్ మండలం సిర్‌పెల్లి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టువద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

లోకేశ్వరం: ఎన్నికలొస్తే చాలు పట్టణాలు, గ్రామాలు అని తేడా లేకుండా మద్యం ఏరులై పారుతోంది. అన్ని పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు మద్యాన్నే ఎరగా చూపుతున్నాయి. లోక్‌సభ ఎన్నికల కోడ్ సాకుగా చూపి గ్రామాల్లో బెల్ట్‌షాపుల నిర్వాహకులు మద్యం ధరలను మరింత పెంచారు. నగదు రవాణా కూడా పెరిగింది. వీటి నియంత్రణకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేసి పట్టుకుంటున్నా చెక్ పడడం లేదు.

పోలీసుల తనిఖీలు..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యం పోలీసులు నిఘా కట్టుదిట్టం చేశారు. కోడ్ పటిష్టంగా అమలు చేస్తున్నారు. నగదు, మద్యం రవాణాను అడ్డుకునేలా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని తానూర్ మండలం జౌళ(బి), బెల్ తరోడ, కుభీర్ మండలం డోడర్న, సిర్‌పల్లి, బాసర మండలం బిద్రెల్లి, కుంటాల మండలం దౌనేల్లితండా, సారంగాపూర్ మండలం సిర్‌పెల్లి గ్రామాల్లో అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఈ ఏడు చెక్ పోస్టుల వద్ద పోలీసులు నిరంతరంగా తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో మద్యం, నగదు రవాణాకు చెక్ పెడుతున్నారు. తనిఖీల్లో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.53,02,610 నగదుతోపాటు రూ.5,93,994 విలువైన మద్యం పట్టుకున్నారు.



మన్మద్ గ్రామంలో ఇటీవల పట్టుకున్న మద్యం

సామాన్యుల పరేషాన్..

ఎన్నికల కోడ్‌తో సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. శుభకార్యాలపై ఎక్కువగా ప్రభావం పడుతోంది. వివాహాల సందర్భంగా వస్త్రాలు, బంగారం, పెళ్లి సామగ్రి కొనుగోలుకు నగదు అవసరం. కోడ్ నేపథ్యంలో నగదు తీసుకెళ్లేందుకు సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లే అవకాశం లేకపోవడం ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగదుకు సరైన ఆధారాలు చూపకపోయినా బంగారు ఆభరణాలు పెద్ద మొత్తంలో తీసుకెళ్తున్నా స్వాధీనం చేసుకుంటున్నారు. శుభకార్యాల కోసం బ్యాంకుల నుంచి డబ్బు డ్రా చేసినా, వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకున్నవారు ఆ నగదు తీసుకెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

విచ్చలవిడిగా మద్యం..

రోడ్లపై వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు గ్రామాల్లోని బెల్ట్ షాపులను నియంత్రించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల్లో అధిక ధరలకు మద్యం అమ్ముతున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నాయకులు కూడా మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



జిల్లాలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఎంతటివారైనా ఉపేక్షించం. కోడ్ ఉల్లంఘనలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– జానకీషర్మిల, ఎస్పీ

మిమ్మల్ని మరువం..



మాట్లాడుతున్న డాక్టర్ చక్రధారి, పాల్గొన్న యువతీయువకులు

- ప్రాణత్యాగాలు.. పాఠాలు కావాలి
- అమరుల పేర్లు చరిత్రలో నిలవాలి
- రాంజీ స్ఫూర్తి ముందుతరానికి అందాలి
- 'సాక్షి' ప్రత్యేక కార్యక్రమంలో యువత ఆకాంక్ష

నిర్మల్: దేశ స్వాతంత్య్రం కోసం, ఈ నేల, ఇక్కడి అడవి విముక్తి కోసం ఆంగ్లేయులు, హైదరాబాద్ నవాబులతో రాంజీ సహా వెయ్యి మంది త్యాగాన్ని ఎప్పటికీ మరువమని పలువురు అభిప్రాయపడ్డారు. అడవిబిడ్డల అసాధారణ పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. అమరుల త్యాగం ముందుతరాలకు అందేలా ప్రయత్నిస్తామన్నారు. రాంజీసహా వెయ్యిమంది అమరవీరుల వర్ధంతి సందర్భంగా డా.కావేరి ఫౌండేషన్ సహకారంతో జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో 'సాక్షి' ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. నిర్మల్ చరిత్రను అందరికీ తెలిసేలా 'సాక్షి' చేస్తున్న కృషిని అభినందించారు.

చరిత్రకెక్కాలి..

1857 ప్రథమ భారత సంగ్రామానికి కొనసాగింపుగా నిర్మల్ గడ్డపై రాంజీగోండు కొనసాగించిన పోరాటం, వెయ్యిఉరుల మర్రి ఘటన ఇప్పటికైనా చరిత్రకెక్కాలని, ముందుతరాలకు అందేలా పాఠ్యాంశాలుగానూ రూపొందించాలని ప్రముఖకవి, డాక్టర్ కావేరి ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అప్పాల చక్రధారి అన్నారు. 1857–60వరకు రాంజీగోండు సారథ్యంలో చేసిన పోరాటం విశేషమైందన్నారు. నిర్మల్‌లో ఒకేసారి వెయ్యిమందిని ఉరితీసిన ఘటన ఇప్పటికీ చరిత్రకెక్కపోవడం బాధాకరమన్నారు. నిర్మల్ చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి 'సాక్షి' చేస్తున్న కృషి అమోఘమన్నారు. అనంతరం పలువురు యువతీయువకులు మాట్లాడారు.

మాకే తెలియని ఘటన..



ప్రథమ భారత సంగ్రామంలోనూ నిర్మల్ ప్రాంతం భాగమైందన్న విషయం తెలియగానే ఆశ్చర్యంగా అనిపించింది.నిర్మల్‌లో వెయ్యి ఉరులమర్రి ఘటన జరిగిన విషయం ఇప్పటి యువతరంలో చాలామందికి తెలియదు. ఇంతపెద్ద పోరాటాన్ని ముందుతరాలకు తెలిసేలా చేయాలి.

– సాహితీ, సాత్విక

స్ఫూర్తిగా నిలిచారు..



స్వాతంత్య్ర పోరాటంలో ఎంతోమంది సమరయోధులకు రాంజీసహా వెయ్యి మంది అమరవీరులు స్ఫూర్తిగా నిలిచారు. కుమురంభీంలాంటి వీరులు తయారయ్యారు. వెయ్యిఉరులమర్రి ఘటన చరిత్రలో లేకపోవడం బాధాకరం. పోరుచరిత్ర మరింత వెలుగులోకి రావాలి.

–నవ్య, రాజమణి

పాఠ్యాంశంగా పెట్టాలి..



దేశచరిత్రలోనే నిర్మల్ పేరును నిలిపేలా చేసిన వెయ్యి ఉరులమర్రి ఘటనను పాఠ్యాంశంగా విద్యార్థులకు అందించాలి. ముందుతరాలకూ తెలిసేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించాలి.

– పోలీస్ భీమేశ్, శివశంకర్

'సాక్షి' కృషి అభినందనీయం..



వెయ్యి ఉరులమర్రి వంటి ఘటనలను అందరికీ తెలిసేలా 'సాక్షి' ప్రత్యేక కథనాలను అందిస్తోంది. చరిత్రను సజీవంగా ఉంచుతూ మరింతమందికి అందేలా కృషి చేస్తోంది. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఎంతో మందికి అవగాహన కలుగుతుంది. 'సాక్షి' కృషి అభినందనీయం

–గౌతమ్, నిర్మల్

రాంజీ వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి

- ఆదివాసీ సంఘాలు, తుడుం దెబ్బ నాయకుల డిమాండ్

నిర్మల్‌చైన్‌గేట్: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడి అమరులైన మొట్టమొదటి ఆదివాసీ అమరవీరుడు మర్సుకోల రాంజీగోండు సహా వెయ్యిమంది అమరవీరుల వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని ఆదివాసీ సంఘాల, తుడుం దెబ్బ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని ఎల్లపల్లి మార్గంలో వెయ్యిఉరుల మర్రి ప్రాంతంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివాసీ సంప్రదాయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ భారత ప్రథమ స్వాతంత్య్ర పోరాటంలో తెలంగాణ నేల కూడా భాగమైందన్నారు. ఇక్కడ జరిగిన వెయ్యి ఉరులమర్రి ఘటన చరిత్రపుటల్లో ఎక్కడా లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు పాఠ్యాంశంగా ముందుతరాలకు అందించాలని కోరారు. జిల్లా కేంద్రంలో రాంజీగోండు కాంస్య విగ్రహం, అమరధామం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కుమురంభీం కాలనీ ఆధ్వర్యంలో..

వెయ్యిమంది అమరవీరుల వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కుమురంభీమ్ కాలనీ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో స్థూపం వద్ద నివాళులర్పించారు. ఆదివాసీ సంప్రదాయబద్ధంగా నివాళులర్పించి, అమరులను తలుచుకున్నారు. ఆదివాసీ సంఘాలకు చెందిన జిల్లా నాయకులు సాకి లక్ష్మణ్, సురపు సాయన్న, మంద మల్లేశ్, నర్సయ్య (సత్య), తోడసం గోవర్ధన్, నైతం భీంరావు, వెట్టి మనోజ్, గోడం రేణుక, సోయం లలిత పాల్గొన్నారు.

అమరుల త్యాగాలను గుర్తించాలి..

ఒకే మర్రిచెట్టుకు రాంజీగోండుతోసహా వెయ్యి మంది అమరుల ప్రాణాలను గుర్తించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కైరి శశి కోరారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఎల్లపల్లి వద్ద అమరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 1857 ప్రథమ సంగ్రామంలోనే పాల్గొన్న గొప్ప చరిత్ర నిర్మల్ ప్రాంతానికి ఉందన్నారు. ఇప్పటికైనా వెయ్యిమంది అమరవీరుల ప్రాణత్యాగాలను గుర్తించి ఏప్రిల్ 9న వర్ధంతి అధికారికంగా నిర్వహించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాంజీసహా వెయ్యిమంది వీరుల పోరాటం, త్యాగాలను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలన్నారు. చైన్‌గేట్ వద్ద రాంజీగోండు భారీ కాంస్య విగ్రహం ఏర్పాటు, ఎల్లపెల్లి దారిలోని అమరుల స్థూపం వద్ద అభివృద్ధి చర్యలు తీసుకోవాలన్నారు. రాజు, రమేష్, శివ, సాయిచరణ్, శశాంక్, శ్రీనిత్, మున్నా, జశ్వంత్, వంశీ పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ఆదివాసీ నాయకులు

రాంజీగోండు ఆశయ సాధనకు కృషి చేద్దాం

రాంజీ గోండు ఆశయ సాధనకు కృషి చేద్దామని ఎస్‌ఎఫ్‌ఐ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నామత్కర్ నవీన్ అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో రాంజీ గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాంజీగోండు మ్యూజియం ఏర్పాటు చేస్తామని కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు చెప్పినా ఇప్పటికీ కలగానే మిగిలిపోయిందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సంతోష్, సాయి, సత్యం పాల్గొన్నారు.



ఉగాది వేడుకల్లో భాగంగా నిర్వహించిన హోమంలో పాల్గొన్న సమితి సభ్యులు

ఘనంగా ఉగాది

శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను జిల్లా అంతటా ఘనంగా జరుపుకున్నారు. ప్రజలు ఉదయమే స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి ఆలయాలకు వెళ్లారు. దైవదర్శనం చేసుకుని పూజలు చేశారు. ఉగాది పచ్చడి సేవించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనాల్లో పాల్గొన్నారు. రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట వెన్నెల డ్యాన్స్ అకాడమీ చైర్మన్ ధన్‌రాజ్ ఆధ్వర్యంలో జానపద జాతర నిర్వహించారు. స్థానిక సోఫీ నగర్‌లోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అంతకుముందు కళాకారులు వరంగల్ శీనన్న, చాకటి రవి ఆటపాటలతో అలరించారు. సారంగపూర్ మండలం కౌట్ల(బి) గ్రామంలో రైతులు బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్నారు. - నిర్మల్‌టౌన్/సారంగాపూర్



ముధోల్‌లో వ్యవసాయ పనులకు..



కౌట్ల(బి)లో బ్యాడ్మింటన్‌కు సిద్ధమైన రైతుల





వెన్నెల డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు



భైంసా రూరల్ : వ్యవసాయ పనులు మొదలు పెడుతున్న రైతు కుటుంబం

ధాన్యం కొనుగోళ్లకు ఐరిస్



కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ (ఫైల్)

- ధాన్యం కొనుగోళ్లకు కొత్త విధానం
- అక్రమాలకు చెక్ పెట్టేలా చర్యలు
- కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ
- జిల్లా వ్యాప్తంగా 203 కొనుగోలు కేంద్రాలు

వివరాలు:	
మొత్తం కొనుగోలు కేంద్రాలు	203
డీఆర్డీఏ కేంద్రాలు	51
పీఏసీఎస్ కేంద్రాలు	89
డీసీఎంఎస్ కేంద్రాలు	58
జీసీసీ కేంద్రాలు	5

ధాన్యం కొనుగోలు లక్ష్యం
20.5 లక్షల మెట్రిక్ టన్నులు

అవసరమైన గన్నీ బ్యాగులు
51.36 లక్షలు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న గన్నీ బ్యాగులు **26.08 లక్షలు**

నిర్మల్‌చైన్‌గేట్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దళారీ వ్యవస్థను కట్టడి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా పౌరసరఫరాల శాఖ కొత్తగా ఐరిస్ విధానం తీసుకొచ్చింది. గతంలో ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేవారు. తాజాగా ఓటీపీతోపాటు ఐరిస్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీంతో అక్రమాలకు చెక్ పడనుంది. జిల్లా వ్యాప్తంగా 203 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని యంత్రాంగం నిర్ణయించింది. ఇప్పటికే 202 కేంద్రాలను ప్రారంభించారు. ఈ కేంద్రాల్లో నూతన విధానం అమలు చేయనున్నారు.

కౌలు రైతులు నమోదు చేసుకోవాలి...

కౌలు రైతుల మొదట ఏఈవోలను కలిసి ఎవరి భూమిని కౌలుకు తీసుకున్నారో వివరాలు నమోదు చేయించాలి. ఈ వివరాలను ఏఈవో ఓపీ ఎంఎస్ (ఆన్‌లైన్ పాక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో నమోదు చేస్తారు. దీంతో కౌలురైతు సైతం తాను పండించిన ధాన్యం విక్రయించుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో సుమారుగా 15 వేల కౌలు రైతులు ఉన్నట్లు సమాచారం.

అందుబాటులో గోనె సంచులు..

జిల్లా వ్యాప్తంగా 203 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సుమారు 51.36 లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం ఏ–గ్రేడ్ రకానికి రూ. 2,203, బీ–గ్రేడ్ రకానికి రూ. 2,108 ధరను నిర్ణయించింది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమశాతం ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

రూ.500 బోనస్‌పై స్పష్టత కరువు..

రైతులు ధాన్యాన్ని విక్రయించే సమయంలో క్వింటాకు రూ.500 అదనంగా బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. ఇప్పుడిప్పుడే పంట చేతికి రావడం.. కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న నేపథ్యంలో రూ.500 బోనస్‌పై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువైంది. దీంతో ధాన్యం విక్రయించాలా వద్దా అనే సంశయంలో రైతులు ఉన్నారు.

గతంలో ఇలా...

గతంలో రైతులు ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాను నమోదు చేస్తే వారి సెల్‌ఫోన్‌కు ఓటీపీ వచ్చేది. దానిని ట్యాబ్‌లో నమోదు చేసి ఓటీపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేసేవారు. రైతుల పేరుతో వ్యాపారులు, దళారులు విక్రయిస్తున్నట్లు గుర్తించిన అధికారులు ఐరిస్ అమలు చేయాలని నిర్ణయించారు. గతంలో ఇతర ప్రాంతాల నుంచి ధాన్యం తీసుకువచ్చి కొను గోలు కేంద్రాల్లో దళారులు విక్రయించేవారు. అలా అక్రమాలను కట్టడి చే సేందుకు ఐరిస్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ధాన్యం విక్రయించే రైతు తప్పనిసరిగా కొనుగోలు కేంద్రానికి రావాల్సి ఉంటుంది. ధాన్యం కాంటా అయిన తర్వాత సెంటర్ నిర్వాహకులు ఐరిస్ తీసుకోనున్నారు. దీనిపై ఇటీవల కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ ఇచ్చారు. ఐరిస్ యంత్రాలను అధికారులు అందజేస్తున్నారు.

క్లుప్తంగా

అలరించిన అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు



కుస్తీపడుతున్న మల్లయోధులు

కుభీర్: మండల కేంద్రమైన కుభీర్‌లో విఠలేశ్వర ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పండగను పురస్కరించుకొని ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అంతర్రాష్ట్ర కుస్తీ పోటీలు నిర్వహించారు. ఇందులో నియోజకవర్గంలో పలు గ్రామాల భక్తులతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాల మల్లయోధులు పాల్గొని కుస్తీలు పట్టారు. మొదటి బహుమతి రూ.6వేలు నవీన్ (హర్యానా) గెలిచారు. రెండవ బహుమతిగా రూ.4వేలను ప్రశాంత్ (పర్భణీ) కై వసం చేసుకున్నాడు. ఆలయ కమిటీ చైర్మన్ బి.పెంటాజి, మాజీ మండల అధ్యక్షుడు బి.విఠల్, బీజేపీ నాయకులు శేఖర్, ఉప్పు దత్తాత్రి, సాయినాథ్, వి.నాగేష్, కనకయ్య ఇలయ కమిటీ సభ్యులు నాగలింగం, శంకర్, రాజన్న ఉన్నారు.

మే 6నుంచి డిగ్రీ 2,4,6 సెమిస్టర్ పరీక్షలు

కేయూక్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ బీబీఏ బీఏ (ఎల్ఎం)కు సంబంధించిన రెండో, ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6నుంచి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7వ తేదీనుంచి నిర్వహించనున్నట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి ఓ మంగళవారం ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు మే 7, 9, 15, 17, 20, 22, 24, 27 తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరో సెమిస్టర్ పరీక్షలు మే 6, 8, 10, 16, 18, 21, 23, 25, 28, 30, 31, జూన్ 1, 3వ తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చివరిచూపునకు నోచుకోకుండా..

- సౌదీలో భైంసావాసి మృతి



మెరాజ్‌ఖాన్(ఫైల్)

భైంసాటౌన్: ఉపాధి నిమిత్తం సౌదీలోని మక్కాకు వెళ్లి అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసావాసి మృతి చెందాడు. స్థానికులు, కుటుంబీకుల వివరాల ప్రకారం.. పట్టణంలోని నయాబాదికి చెందిన మెరాజ్‌ఖాన్(38) మూడునెలల క్రితం ఉపాధి కోసం సౌదీలోని మక్కాకు వెళ్లాడు. సోమవారం అక్కడ మసీదులో ప్రార్థనల అనంతరం రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. దీంతో ఈ ఘటనలో మెరాజ్‌ఖాన్ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడున్నాడు. పేద కుటుంబం కావడంతో అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని సూచించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఇరవై రోజులవుతోంది..

మిషన్ భగీరథ నీటిని వాడని.. బోరిగాంతండా వాసులు

- భగీరథ నీటితో దద్దుర్లు, దురద..
- నీటిలో చెత్తాచెదారం వస్తుందని ఆవేదన
- ఆలయ బోరు వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన వైనం



బోరు నుండి నీళ్లు తీసుకొని పోతున్న మహిళలు



వృథాగా వదిలేసిన మిషన్ భగీరథ నీళ్లు

లక్ష్మణచాంద: మన నిత్య జీవితంలో నీరు లేనిది మానవ మనుగడ లేదు. ఉదయం లేచింది మొదలు సాయంత్రం పడుకునే వరకూ ప్రతి పనికి మనిషి నీటిని వినియోగిస్తాడు. ప్రస్తుతం భానుడు భగభగ మండుతున్నాడు. ఎండ తీవ్రతకు ప్రజలు నీటితోనే ఎక్కువ ఉపశమనం పొందుతారు. అయితే మండలంలోని బోరిగాం గ్రామానికి అనుబంధ గ్రామమైన బోరిగాం తండా ప్రజలు మండు వేసవిలో తాగునీటికి తండ్లాట పడుతున్నారు. ఇక్కడి ప్రజలు ఇంటికి.. వంటికి నీటికి కోసం తీవ్ర అవస్తలు ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం లేకపోలేదు.. మిషన్ భగీరథ నీటిని 20 రోజులుగా వాడడం లేదు. ఆ నీటిని తాగడంతో దురద.. దద్దుర్లు రావడంతో పశువులకు సైతం ఆ నీటిని తాగించడం లేదు. దీంతో నీటి కోసం ఓ చిన్న మోటారు వద్ద పడిగాపులు కాస్తున్నారు.

భగీరథ నీళ్లతో దురద..

మొదట బాగానే వచ్చిన నీళ్లను గ్రామస్తులు వినియోగించారు. కొద్దిరోజుల తరువాత నీళ్లు బాగ లేకపోవడంతో ఆ నీటిని తాగడానికి, స్నానాలకు వినియోగించినప్పుడు గ్రామంలోని చిన్నా,పెద్ద అనే తేడా లేకుండా అందరికి దురద మొదలైంది. ఒంటిపై మొత్తం దద్దుర్లు రావడంతో 20రోజులుగా మిషన్ భగీరథ నీటిని దేనికి వినియోగించడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

రెండు పూటలు బోరునీళ్లే..

గ్రామంలో మొత్తం 60 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ 250-300 మంది నివాసం ఉంటున్నారు. వీరందరికీ ఆలయం వద్ద ఉన్న ఒకే బోరు నుంచి నీళ్లు తీసుకెళ్తున్నారు. ఉదయం, సాయంత్రం కొందరు బిందెల్లో నీటిని తీసుకెళ్తుండగా మరికొందరు బాటిల్స్ తెచ్చుకుని అందులో నీటిని తీసుకెళ్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలాగా చొరవ చూపి ప్రజల ఇబ్బందులు తొలగించాలని తండావాసులు కోరుతున్నారు.

తాగేందుకు వీలులేని భగీరథ నీళ్లు..

మండలంలోని బోరిగాం గ్రామానికి అనుబంధ గ్రామమైన బోరిగాం తండాలో మిషన్ భగీరథ ట్యాంకు ఉంది. దీనికి నిత్యం నీటి సరఫరా అవుతోంది. కానీ ఈ నీటిలో చెత్తాచెదారం, మట్టి, వెంట్రుకలు వస్తున్నాయని, దీంతో మిషన్ భగీరథ నీళ్లు దేనికి వినియోగించుకునే విధంగా లేవని తండావాసులు వాపోతున్నారు.



మురిగా వస్తున్న మిషన్ భగీరథ నీరు



బోరువద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

ఇంటికి.. ఒంటికి బోరు నీళ్లే దిక్కు..

గ్రామంలోని మిషన్ భగీరథ నీళ్లు బాగా లేకపోవడంతో గ్రామంలోని ప్రతి ఇంటికి నిత్యవసరాలకు నీటి కోసం ఇబ్బంది ఏర్పడింది. దీంతో గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద గల బోరుకు పైపు ఏర్పాటు చేసుకొని దాని వద్ద నుంచి గ్రామంలోని అందరు నీటిని తీసుకెళ్తున్నారు. తాగడానికి, స్నానాలకు ఇలా అన్ని రకాల పనులకు ఇక్కడ బోరు నీళ్లే తాగాల్సిన పరిస్థితి. కనీసం గ్రామంలోని పశువులకు కూడా మిషన్ భగీరథ నీళ్లను వినియోగించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో గంటల తరబడి నీటి కోసం వేసి చూడాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు.

సమాకకు సరఫరా కానీ 'భగీరథ'

- వ్యవసాయ బావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న ఆదివాసీలు



భగీరథ సంపు నుంచి నీటిని తోడుతున్న సమాక గిరిజనులు

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక గ్రామానికి వారం రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఆ గ్రామస్తులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో 126 ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా మిషన్ భగీరథ సంపు నుంచి నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో గ్రామస్తులు వ్యవసాయ బావులు, బోరుబావుల నుంచి ఎడ్లబండ్లు, బిందెలతో నీటిని తీసుకొచ్చుకుంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కింద స్థాయి సిబ్బంది నీటిని సరఫరా చేయడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి తమ గ్రామానికి ప్రతీ రోజు మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.



బావి నుంచి ఎడ్ల బండ్లు, బిందెలతో నీటిని తీసుకెళ్తున్న సమాక గిరిజనులు

ఇబ్బందిగా ఉంది..



గ్రామంలోని మిషన్ భగీరథ నీళ్లు మంచిగ వస్తలేవు. దీంతో బోరు నుంచి అందరు ఒకేసారి తెచ్చుకోవడంతో అక్కడ నీళ్ల కోసం పడిగాపులు పడాల్సి వస్తుంది. తాగడానికి, స్నానాలకు అన్నింటికి ఇక్కడ నుంచే నీటిని తీసుకుపోవడం ఇబ్బందిగా ఉంది.

– రాథోడ్ లత, బోరిగాం తండా

దురద వస్తుంది



గ్రామంలోని మిషన్ భగీరథ నీళ్లు తాగినా, స్నానాలు చేయడానికి వినియోగించినా తమకు, పిల్లలకు దద్దుర్లు వస్తున్నాయి. దీంతో ఆ నీటిని వాడుతలేం. బోరు వద్ద నీటిని తీసుకొని వస్తున్నాం. అధికారులు స్పందించాలి.

– జాదవ్ పద్మ, బోరిగాం తండా

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



తమ గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ నీళ్లు మంచిగ రావడం లేదు. దీంతో బోరు నీళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. అధికారులు వెంటనే స్పందించి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అయ్యేలాగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– ప్రేమ్‌సింగ్, బోరిగాం తండా

చర్యలు చేపడుతాం

మండలంలోని బోరిగాం తండాకు వెళ్లి ట్యాంకును పరిశీలించి స్వచ్ఛమైన మంచి నీళ్లు గ్రామానికి సరఫరా అయ్యేలాగా తగిన చర్యలు వెంటనే చేపడుతాం. తాగునీటికి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తాం.

– రాజశేఖర్‌రెడ్డి, ఏఈ, మిషన్ భగీరథ

నగదు సీజ్



తనిఖీ చేపడుతున్న ఎఫ్ఎస్‌టీ అధికారులు

జైనథ్: మండలంలోని ఫౌజ్‌పూర్ వద్ద రూ.96,500 నగదును సీజ్ చేసినట్లు ఎఫ్ఎస్‌టీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా బేల మండలం టాక్లీ నుంచి మహారాష్ట్రలోని దేహెగావ్‌కు కార్‌లో వెళ్తున్న కిరణ్ పరమేశ్వర్ అనే వ్యక్తి వద్ద రూ. 1,96,500 నగదు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డబ్బును సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.77వేల నగదు స్వాధీనం

భైంసాటౌన్: ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.77వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక బొర్రా గణేశ్ మందిర్ వద్ద వాహన తనిఖీలు చేపడుతుండగా, పట్టణానికి చెందిన ఎండీ ఫైజుల్లాఖాన్ అనే వ్యక్తి ఎన్నికల నిబంధనావళికి విరుద్ధంగా నగదు తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై దేవాపూర్ చెక్‌పోస్టు సమీపంలో మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన అక్షయ్ తీవ్రగాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన ప్రకారం... అక్షయ్ తెల్లవారు జామున సుమారు 3గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై రాంగ్‌రోడ్లో తన కారులో ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో అక్షయ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

'ఆదిలాబాద్ ఎంపీ స్థానం బీజేపీదే'

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపీ పార్టీదేనని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ తెలిపారు. మంగళవారం ధరంపురి, ఏసాపూర్, మోర్కండి, గులాబ్ తాండ, అనంతపూర్, హర్కయి, టెంబి మంజరంతండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, మండల అధ్యక్షుడు బత్తిని సుధాకర్, కేవల్‌సింగ్, పెరుగు సంతోష్, అల్కే గణేష్, నానం రమణ, కొత్త శంకర్, నందినర్సయ్య, భోజరెడ్డి, సంతోష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాంతులు చేసుకుని చిన్నారి మృతి

- నెలరోజుల క్రితం గుండెకు సంబంధించిన ఆపరేషన్
- రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి
- పండుగపూట కైలాస్‌నగర్‌లో విషాదం



శృతిలయ మృతదేహం

ఇంద్రవెల్లి: వాంతులు చేసుకుని చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందిన సంఘటనతో మండలంలోని హర్కపూర్ అంద్ గూడ గ్రామపంచాయతీ పరిధిలోని కైలాస్‌నగర్‌లో విషాదం నెలకొంది. కుటుంబీకుల వివరాల ప్రకారం... డాకురే రాము, మంజుల దంపతులకు శృతిలయ(6), మూడేళ్ల పృతిరాజ్ ఉన్నారు.నెల రోజుల క్రితం శృతిలయ అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు గుండెలో నరం బ్లాక్ అయిందని, ఆపరేషన్ చేయాలని తెలిపారు. వైద్యులు సూచనల మేరకు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్ చేయించారు. దీంతో నెల రోజులుగా చిన్నారి ఆరోగ్యంగానే ఉంది. మంగళవారం తెల్లవారు జామున వాంతులు చేసుకోవడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందింది. ఉన్న ఏకైక కూతురు మృతి చెందడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

సాంగ్విలో హైటెక్ ఇసుక తవ్వకాలు

- మూడు జేసీబీలు, బోట్ సహాయంతో తవ్వకాలు
- తవ్వకాల కోసం పెన్‌గంగలో ప్రత్యేక దారి



పెన్‌గంగలో కృత్రిమంగా ఏర్పాటు చేసినదారి



పెన్‌గంగలో ఏర్పాటు చేసిన బోట్

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామ సమీపంలోని పెన్‌గంగ నదిలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తవ్వకాలు, రవాణా చేపడుతుండగా ప్రస్తుతం ఏకంగా జేసీబీలతో తోడేస్తున్నారు. దీనికి తోడు మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా తెప్పించిన బోట్‌ను వాడి నది నీళ్లలోంచి ఇసుక బయటకు తీస్తున్నారు. బ్యాటరీలు, జనరేటర్ బిగించిన ప్రత్యేకమైన బోట్‌తో సునాయాసంగా నీళ్ల నుంచి ఇసుక వేరు చేస్తూ జేసీబీలతో కుప్పలు పోస్తున్నారు. అనంతరం రాత్రి వేళ లారీల్లో ఇసుక లోడ్‌ను నింపి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్రకు సైతం రవాణా చేస్తున్నారు.

రంగంలోకి దిగిన పోలీసులు

జేసీబీలు, బోట్‌లతో హైటెక్ ఇసుక తవ్వకాలు చేపడుతున్న సమాచారం అందడంతో జైనథ్ సీఐ సాయినాథ్ ఆదేశాల మేరకు ఎస్సై పురుషోత్తం సిబ్బందితో కలిసి సాంగ్వి వద్ద దాడులు చేపట్టారు. పెన్‌గంగలోని మూడు జేసీబీలు, ఒక బోట్‌ను గుర్తించి మైనింగ్, రెవెన్యూ, ఆర్టీఏ అధికారులకు తదుపరి చర్యల కోసం సమాచారం అందించారు. మూడు జేసీబీలతో పాటు బోట్‌ను సైతం సీజ్ చేసి జరిమానా వేస్తామని ఆయన తెలిపారు. అక్రమ ఇసుక దందా ఎవరూ నిర్వహించినా ఉపేక్షించబోమని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడులు



పట్టుబడ్డ మద్యం బాటిళ్లతో పోలీసులు

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోశెట్టి అనే వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన వద్ద నుంచి రూ.9వేల విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మద్యం పట్టివేత..

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించి రూ.5400 విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అక్రమంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అఫ్సర్ ఉన్నారు.



ఇంద్రవెల్లి: మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్సై

ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జందాపూర్, బంగారుగూడలలో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. ఎస్సై ముజాహిద్ వివరాల ప్రకారం.. ఎన్నికల్లో భాగంగా జందాపూర్ గ్రామంలో కొప్పరి ప్రభాకర్, బంగారుగూడలో దార్ల పవన్ బెల్టుషాపు నిర్వహిస్తుండగా పట్టుకుని ఒక్కొక్కరి నుంచి లీటర్నర మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాంటి వారు ఉంటే తమకు సమాచారం అందించాలని తెలిపారు.

కుంటాలలో వర్షం



ధాన్యంపై కవర్లు కప్పి ఉంచిన రైతులు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం వేకువజామున ఉరుముల మెరుపులతో కూడిన వర్షం కురిసింది. విక్రయించేందుకు కల్లాల్లో పోసిన మొక్కజొన్న తడవ కుండా రైతులు టార్పాలిన్ కప్పి ఉంచారు. దీంతో ధాన్యం తడవలేదు. ఇక వర్షంతో మండలంలో వాతావరణం చల్లబడింది.

గాలివానకు తెగిన విద్యుత్ తీగలు

కుభీర్:మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున ఈదుర గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు. గాలుల ధాటికి రెండు స్తంభాల తీగలు తెగిపడ్డాయి. దీంతో వెంటనే విద్యుత్ అధికారులు స్తంభాలను సరిచేసి తీగలను ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు.

ఎస్సారెస్పీని సందర్శించిన ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: నిజామాబాద్ జిల్లా శ్రీరాంసాగర్ జలాశయాన్ని సోమవారం రాత్రి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరిరావు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ సందర్శించారు. నిర్మల్ జిల్లాలోని సదర్మాట్, సరస్వతి కాలువల పరిధిలో రైతాంగానికి యాసంగి పంటకు సరిపడా సాగునీటిని అందించాలని అధికారులను కోరారు. ఎమ్మెల్యే వెళ్లిన సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఈ విషయాన్ని ఫోన్‌లో తెలిపారు. పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున నీటిని విడుదల చేయాలని కోరగా అధికారులు సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు.



ఎస్సారెస్పీ వద్ద ఎమ్మెల్యే, డీసీసీ, ఎంపీ అభ్యర్థి

ప్రత్యేకం మరాఠీల 'గుడిపాడ్వా'

గుడిహత్నూర్: హిందూ సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకొని మండలంలోని మరాఠీలు చేసుకున్న పండుగ 'గుడిపాడ్వా' ప్రత్యేకంగా నిలిచింది. ఉదయాన్నే వాకిళ్లను శుద్ధి చేసి రంగుల ముగ్గులు వేసి వాకిట్లో ఓ కొత్త కర్రకు చీరను కట్టి, దానిపై కలశ ముంతను బోర్లేసి పూలమాలలు వేసి ఆ కర్రను పీఠపై ఉంచి నిలదీశారు. ఇలా సాయంత్రం వరకు ఉంచి పూజలు చేశారు. కొత్త ఏడాది ప్రారంభం రోజున ఇలా తమ సంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలకడం అనాదిగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. కాగా ఊరంతా ఇలా చేయడంతో ప్రత్యేక జెండాలు ఆవిష్కరించినట్లుగా నిలిచింది మరాఠీల 'గుడిపాడ్వా'.

